# ప్రజాశక్తి

గురువారం 17 నవంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# మందకొడిగా స్థిరాస్తి వ్యాపారం

## తగ్గిన రిజిస్ట్రేషన్లు

- ఈ ఏడాది అర్ధభాగంలో 73.69 శాతం ఆదాయం
- యలమంచిలిలో అతి తక్కువ రిజస్ట్రేషన్లు
- రియల్టర్ల మోసాలతో ఆసక్తి చూపని మదుపరులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన స్టాంపులు, రిజస్ట్రేషన్ల శాఖ నుంచి అనకాపల్లి జిల్లాలో ఆశించిన ఆదాయం రాలేదు. భూములు, స్థిరాస్తుల క్రయవిక్రయాలు పెద్దగా జరగక పోవడంతో రిజస్ట్రేషన్ల శాఖ లక్ష్యానికి దూరంగా ఉంది. జిల్లాలోని పది సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు ఈ ఆర్థిక సంవత్సరం అర్ధ భాగానికి (సెప్టెంబరుకు) రూ.180.36 కోట్ల ఆదాయం రావాల్సివుండగా, రూ.132.90 కోట్లు వచ్చింది. లక్ష్యంలో 73.69 శాతానికి చేరుకోగలిగింది. పట్టణంలోనూ, దీనికి ఆనుకొని స్థిరాస్థి వ్యాపారాలు జరగడంతో అనకాపల్లి సబ్ రిజస్ట్రార్ కార్యాలయం ఒక్కటే లక్ష్యానికి దగ్గరగా 96.44 శాతానికి చేరుకోగలిగింది. యలమంచిలి కార్యాలయం 54.19 శాతానికి పరిమితమైంది. ఆదాయం పెంచుకొనేందుకు కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత జిల్లా కేంద్రమైన అనకాపల్లి సహా పలు ప్రాంతాల్లో మార్కెట్ విలువ ప్రభుత్వం పెంచింది. పది సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల్లో యలమంచిలి కార్యాలయం నుంచి ఎక్కువ ఆదాయం వస్తుందని ఆశించి అనకాపల్లి కంటే లక్ష్యం ఎక్కువ విధించారు. కానీ అన్ని కార్యాలయాల కంటే ఇక్కడే తక్కువ ఆదాయం వచ్చింది. ఇంతవరకు రిజస్ట్రేషన్లు మిగతా 2లో..

### ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆదాయ లక్ష్యం, సాధించిన వివరాలు

| సబ్‌రిజస్ట్రార్ | లక్ష్యం | ఆదాయం(కోట్లలో) | శాతం |
|---|---|---|---|
| 1. అనకాపల్లి | 37.82 | 36.47 | 96.44 |
| 2. చోడవరం | 11.09 | 7.73 | 69.73 |
| 3. కె.కోటపాడు | 3.54 | 2.83 | 79.99 |
| 4. కోటవురట్ల | 6.41 | 4.65 | 72.67 |
| 5. లంకెలపాలెం | 33.21 | 21.71 | 65.38 |
| 6. మాడుగుల | 4.16 | 3.40 | 81.79 |
| 7. నక్కపల్లి | 16.17 | 13.15 | 81.35 |
| 8. నర్సీపట్నం | 12.19 | 9.41 | 77.18 |
| 9. సబ్బవరం | 17.65 | 12.86 | 72.86 |
| 10. యలమంచిలి | 38.08 | 20.63 | 54.19 |

# కౌలు రైతు రుణ విముక్తికి ఉద్యమించాలి

## కేరళ తరహాలో పంట కొనుగోలు పద్ధతి పాటించాలి

## కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులివ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కౌలు రైతులందరూ కౌలు రైతు రుణ విముక్తి చట్టం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయం స్వరాజ్యనగర్ పెంటకోట జగన్నాథం ప్రాంగణంలో బుధవారం కౌలు రైతు సంఘం జిల్లా నాలుగో మహాసభ నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టెక్కలి జగ్గారావు, రామ సదాశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హరిబాబు మాట్లాడారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. వీరిలో కేవలం 5 లక్షలా 74 వేలమందికి గుర్తింపు కార్డులు ఇస్తామని ఐదు లక్షలు కూడా ఇవ్వలేదని చెప్పారు. వీరిలో 15 వేల మందికి మాత్రమే రైతు భరోసా ఇవ్వడం మిగతా 2లో..

**తీర్మానాలు**

సుగర్ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని, పాల సేకరణ ధర పెంచాలని, నల్ల బెల్లంపై ఆంక్షలు ఎత్తివేయాలని, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు కొనసాగించాలని, వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు బిగించరాదని కోరుతూ తీర్మానాలు ప్రవేశపెట్టారు.

కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

**పెన్షనర్లు పోరాటానికి సిద్ధం కావాలి : అజశర్మ**

వార్త మెయిన్ 3లో..

**సమస్యలపై టిబి ఆసుపత్రి కార్మికుల ధర్నా**

వార్త 2లో..

**17వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన**

వార్త 5లో..

# ఉత్సాహంగా గిరిజన గౌరవ దినోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోటా) ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన మంగళవారం ప్రారంభమైన గిరిజన గౌరవ దినోత్సవం బుధవారం ఉత్సాహంగా సాగింది. బుధవారం కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంప చోడవరం, చింతూరు, కెఆర్ పురం, నెల్లూరు, శ్రీశైలం ఐటిడిఎ గిరిజన సాంస్కృతిక ప్రదర్శన కళాకారులు నృత్య రూపాలను ప్రదర్శించారు. సీతంపేటకు చెందిన సవర కళాకారుల కంది కోతలు నృత్యం, పార్వతీపురం సవర కళాకారులచే సవర థింసా నృత్యం, శ్రీశైలం చెంచు కళాకారులు చెంచు నృత్యం, పాడేరు కళాకారులు మయూర థింసా, ఖోండు, కెఆర్.పురం, చింతూరు కళాకారులు కొమ్ము కోయ నృత్యం, నెల్లూరు ఐటిడిఎకు చెందిన యానాది కీలు గుర్రం నృత్యం ప్రదర్శించారు. 8 ఐటిడిఎ ప్రాంతాల గిరిజన కళాకారులు తమ కళాఖండాలు, చేతిపనులకు సంబంధించిన వస్తువులను వేదిక వద్ద ఎగ్జిబిషన్ కమ్ సేల్ కోసం కేటాయించిన స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన 25 స్టాల్స్‌లో వెదురు, క్లే, చెక్క క్రాఫ్ట్‌లు, బిస్కెట్లు, జనపనార సంచులు నెగ్-ఫైర్ ద్వారా ప్రైమర్‌లు, అల్లూరి సీతారామరాజు ఆర్ట్ గ్యాలరీ, మెడికల్ స్టాల్, వెదురు చికెన్, జిసిసి ఉత్పత్తులు, కాఫీ, సిల్వర్ ఓక్ ప్రత్యక్ష ప్రదర్శనలో ఉంచారు.

పాడేరు కళాకారుల మయూర థింసా నృత్యం

మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

## ఎమ్మెల్సీ ఎన్నికలకు అదనంగా 17 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు గతంలో 77 పోలింగ్ స్టేషన్లు ఉండగా ప్రస్తుతం అదనంగా 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.వయల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదుకు సంబంధించి వ్యక్తిగత క్లెయిములు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. వాలంటీర్లు ఓటర్లు నమోదు మిగతా 2లో..

# సముద్రపు ఈతగాళ్ల నియామకం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సముద్రంలో ఈతకు వెళ్లి అకస్మాత్తుగా నీటిలో పడి మునిగిపోయే వారిని రక్షించేందుకు గానూ నైపుణ్యం, అర్హత గల లైఫ్ గార్డులు (సముద్ర ఈతగాళ్ల) 38 మందిని నియమించినట్లు జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వెల్లడించారు. బుధవారం జివిఎంసి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ ప్రమాణాలకు అనుగుణంగా తూర్పునౌకాదళం సహాయంతో అన్ని అర్హతలను పరిశీలించిన పిదప 38 మందిని 2022 సంవత్సరానికి గానూ ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు కాకుండా మరో ఆరుగురిని రిజర్వుగా పెట్టుకున్నట్లు చెప్పారు. విశాఖకు విచ్చేసే విదేశీ, స్వదేశీ పర్యాటకులు, ప్రకృతి ప్రేమికుల రక్షణార్థం తీరం అంతటా వీరు పలు చోట్ల పహారా కాసి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం, అవసరమైన సాయం చేస్తారని తెలిపారు. నైపుణ్యం, ఈతరాని వాళ్లను నియమించినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయని, దీంతో నలగురు జివిఎంసి ఎడిసిలను నిర్ధారణ కమిటీగా ఏర్పాటుచేసి అన్ని అర్హతలను పరిశీలించిన పిదప 'లైఫ్ సేవ్ గార్డ్'ల ఉద్యోగాల్లో నియమించినట్లు ప్రకటించారు. మొదటి, రెండవ, మూడవ దశలలో సముద్రంలో 195 మంది ఈతగాళ్లకు పోటీలు నిర్వహించి 38 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో 12 మంది పాతవారేనన్నారు. లైఫ్ గార్డుల వద్ద బైనాక్యులర్లు, ట్యూబ్‌లు ఉంటాయని చెప్పారు. ఎవరైనా ఎక్కడైనా విపత్కర పరిస్థితులను సముద్రంలో ఎదుర్కొంటే వీరికి దూరం నుంచైనా కనిపిస్తుందన్నారు. నావికాదళ రూల్స్ అన్నీ వీరికి వర్తిస్తాయని తెలిపారు. రోబో బోట్లను సైతం త్వరలో మిగతా 2లో..

మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

# సమస్యలపై టిబి ఆసుపత్రి కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన టిబి హాస్పిటల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ శానిటేషన్ కార్మికులు మెయిన్ గేటు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ, ఆరు నెలల బకాయి జీతాలు చెల్లించాలని, పనిగంటలను మూడు షిఫ్ట్‌లు కలిపి 24 గంటలు ఉండేలా చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు ప్రతినెలా చెల్లించాలని ప్రభుత్వం చెబుతున్నా కాంట్రాక్టర్ మూడునాలుగు నెలలకోసారి చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత కాంట్రాక్టర్ కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ వారు 2022 ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెల జీతాలు చెల్లించలేదని, పాత కాంట్రాక్టర్ 2021 మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాలు ఇవ్వలేదని తెలిపారు. తక్షణం బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వి.కేశవరావు, అధ్యక్షులు పి.సోమరాజు, సభ్యులు ఈశ్వరరావు, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి పి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, 40 మంది కార్మికులు పాల్గొన్నారు

## మొదటి పేజీ తరువాయి..

### మందకొడిగా స్థిరాస్తి వ్యాపారం

జరిగిన 45,612 డాక్యుమెంట్లలో అనకాపల్లిలో 8979, యలమంచిలిలో 6181 ఉన్నాయి. యలమంచిలి పరిధిలో అచ్యుతాపురం, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తుల వ్యాపారం జోరుగా సాగుతుందని అంచనావేసి అధికారులు లక్ష్యం పెంచారు. సెజ్‌కు, జాతీయ రహదారికి ఆనుకొనివున్న సమీప ప్రాంతాల్లో స్థిరాస్థి వ్యాపారం మందకొడిగా ఉంది. ఈ ప్రాంతంలో భూములు, ప్లాట్లు క్రయవిక్రయాలు పెద్దగా జరగడంలేదు. అచ్యుతాపురం, యలమంచిలి ప్రాంతాల్లో భారీ రేట్లు ఉండడం కూడా స్థిరాస్థి వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగకపోవడానికి ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో భూముల రేట్లు పెరగడంతో పాటు మోసాలు అధికంగా ఉన్నాయి. కొంతమంది రియల్టర్లు ఒకే భూమిని హద్దులు మార్చి, ఇద్దరు, ముగ్గురికి అమ్ముతున్న విషయాలు వెలుగుచూడ్డంతో భూములు కొనడానికి భయపడుతున్నారు. రియల్టర్ల మోసాలు బయటపడుతున్నప్పటికీ, వారిపై ఏ చర్యలూ తీసుకోకపోవడంతో మోసాలు కొనసాగుతున్నాయి. కొత్తగా ఈ ప్రాంతంలో భూములు కొనడానికి పెద్దగా ముందుకురావడంలేదు. దీంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంపై పడింది.

### కౌలు రైతు రుణ విముక్తికి ఉద్యమించాలి

దారుణం అన్నారు. కౌలు రైతుల జీవితాలు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, కేరళ తరహాలో ప్రైవేటు వ్యవసాయ అప్పులను సైతం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కౌలు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదన్నారు. దీనికోసం ఐక్య ఉద్యమం తప్పనిసరి అన్నారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకూ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. దేవాదాయ భూముల వాస్తవ సాగుదారులకు కూడా ఈ చట్టం వర్తింపజేయాలన్నారు.

జిల్లా కౌలు రైతు సంఘం గత మూడేళ్లలో చేసిన కార్యక్రమాలు, ప్రగతి నివేదికను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ చదివి వినిపించారు. జిల్లా మహా సభల ప్రారంభానికి ముందు అమరవీరులు పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం, పెంటకోట జగన్నాథం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఇటీవల జరిగిన రైతు ఉద్యమాల్లో అసువులు బాసిన అమరవీరులకు సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, కాండ్రేగుల రాము, కాళ్ల తేలయ్యబాబు, గండి నాయనబాబు, ఎస్‌వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు అదనంగా 17 పోలింగ్ కేంద్రాలు

ప్రక్రియలో పాల్గొనరాదని, వారు పాల్గొన్నట్లు ఫిర్యాదులు అందితే విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒకు ఆదేశించారు. అనంతరం పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సుమబాల తదితరులు పాల్గొన్నారు.

### సముద్రపు ఈతగాళ్ల నియామకం

తీర ప్రాంతంలో రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేసే విధానం తెస్తామని కమిషనర్ రాజాబాబు వెల్లడించారు. లైఫ్ గార్డులకు నెలకు రూ.18వేలు జీతంగా నిర్ణయించినట్లు తెలిపారు.

## బిజెపి మతోన్మాద పాలనపై పోరాటం : సిపిఐ

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించేందుకు పార్టీ యంత్రాంగం సన్నద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సమితి సమావేశాలు బుధవారం జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక అభివృద్ధి కుంటుపడిందన్నారు. పౌష్టికాహారలోపంలో దేశం ముందు వరుసలో ఉందన్నారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో చేసిన వాగ్దానాలు అమలు కాకపోయినా కేంద్రంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్వప్రయోజనాల ముసుగులో రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బిజెపికి ప్రత్యామ్నాయంగా దేశవ్యాప్తంగా రాజకీయ ఐక్యవేదిక ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై తమ పార్టీ జాతీయ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎజె.స్టాలిన్, ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్ పాల్గొన్నారు.

## ఎఆర్‌ఒ నియామక ర్యాలీలో అవకతవకలపై నిరసన

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** ఎఆర్‌ఒ వైజాగ్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ-2లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 54 మంది అభ్యర్థులు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆర్మీ జిడి పోస్టులకు సంబంధించిన పరీక్షల్లో 54 మంది అభ్యర్థులకు ఎన్‌సిసి సి సర్టిఫికెట్ ఉన్నా అనర్హులుగా చేసి తిరస్కరించారని బాధిత అభ్యర్థులు ఆరోపించారు. జి.ర్యాలీ, దేహదారుఢ్య, వైద్య పరీక్షలో ఉత్తీర్ణులైన వ్యక్తులు నేరుగా ఉద్యోగానికి అర్హులని, అయినప్పటికీ పరీక్షను నిర్వహించి రిజెక్ట్ చేశారని ఆవేదన వెలిబుచ్చారు. తామంతా వైజాగ్ ఎఆర్‌ఒ ఆఫీసుకు వెళ్లినా సమాచారం ఇవ్వకుండా నెట్టివేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

## 'వైసిపి పాలనలో రైతులకు నష్టం'

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక రైతులు తీవ్రస్థాయిలో నష్టపోయారని, వారి జీవితాలు కుదేలయ్యాయని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తెలుగు రైతు జోన్ -1 సమావేశం టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సమావేశంలో తెలుగు రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు విభాగాల ఇన్‌ఛార్జి దువ్వారపు రామారావు, విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, తెలుగు రైతు వివిధ విభాగాల అధ్యక్షులు కార్యవర్గం పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆక్వా రంగం నాశనమైందన్నారు. కర్నూలులో టమోటాలను రోడ్డు మీద పారేస్తున్నారని తెలిపారు. శ్రీకాకుళంలో దోమపోటు ఇబ్బంది పెడుతోందన్నారు. వరి ధాన్యం కొనుగులు వాలంటీర్ల చేతిలోకి వెళ్లిందని ఆరోపించారు.

## 'విసిసి' విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :** వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఇంటర్నేషనల్ ఇంటరాక్ట్ వీక్, చిల్డ్రన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీలల్లో విజేతలకు బుధవారం ఉదయం ఎంవిపి.కాలనీలోని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వద్ద పార్టిసిపేషన్ సర్టిఫికెట్, బహుమతులను కె.రమాప్రభ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుమారు 100 క్లబ్స్‌లో 5000 మంది పిల్లలు పాల్గొనగా 1200 మందికి సర్టిఫికెట్‌లు, బహుమతులను అందించినట్లు విసిసి కన్వీనర్ కె.సుశీల తెలిపారు.

## మంత్రి అమర్‌నాథ్ అనుచరుల నుంచి ప్రాణహాని

### కలెక్టర్, సిపికి తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ వినతులు

కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న బివి.రామ్

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు, పోలీస్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న తనపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచరులు కక్ష కట్టారన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒక వ్యక్తి గుడివాడ అమర్‌నాథ్ సోదరుడిని అంటూ ఫోన్ చేసి బెదిరించారని తెలిపారు. అతని పేరు కుమార్ అని చెప్పాడని పేర్కొన్నారు. మాటల్లో చెప్పలేని విధంగా దుర్భాషలాడారన్నారు. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను అంతం చేసేందుకు తెలుగు శక్తి నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

## సిబిసిఎన్‌సి టిడిఆర్ రద్దు చేయాలని వినతి

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** క్రిస్టియన్ మైనార్టీకి చెందిన సిబిసిఎన్‌సి స్థలం టిడిఆర్ రద్దుచేయాలని, అడ్డగోలుగా టిడిఆర్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, మేయర్ హరి వెంకట కుమారిలకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సిరిపురం సమీపంలోని సుమారు రూ.500 కోట్ల విలువైన క్రిస్టియన్ మైనార్టీలకు చెందిన స్థలాన్ని కబ్జా చేయడానికి ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, స్మార్ట్ వైజాగ్ సిటీ మాజీ చైర్మన్ జీవీ కలిసి పథకం వేశారని ఆరోపించారు. ఈ స్థల వివాదం హైకోర్టులో నడుస్తుందని, ఎనిమిది కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

## నెలాఖరుకు ఎంవిపి ఇండోర్ స్పోర్ట్స్ ఎరేనా స్టేడియం సిద్ధం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఎంవిపి ఇండోర్ స్పోర్ట్స్ ఎరేనా స్టేడియం ఈ నెల చివరి నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 3వ జోన్ పరిధిలోని ఎంవిపి కాలనీ, అప్పుఘర్, శివాజీ పార్కు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంవిపి కాలనీలోని ఎస్‌ఆర్ కాలేజీ గ్రౌండ్ వద్ద సుమారు రూ.20 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. అప్పుఘర్‌లో సుమారు రూ.56 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మాణంలో ఉన్న 25 ఎంఎల్‌డి ఎస్‌టిపి ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. నిర్ణీత సమయానికే పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం శివాజీ పార్క్ ను సందర్శించి పార్కింగ్ ప్రదేశం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశాలలో గ్రీనరీ పెంపొందించాలని, పార్కులో విద్యుత్తు, తాగునీరు, ఫౌంటైన్, బెంచీలు, పిల్లలు ఆట పరికరాలు సమకూర్చాలని పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయ లక్ష్మి, ఎడి(హార్టికల్చర్) ఎం.దామోదరరావు, ఎసిపి వెంకటేశ్వరరావు, ఎఎంఒహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు వి.వినయ్‌కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## దువ్వూరి స్మారక పురస్కార గ్రహీతకు అభినందనలు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ** : దువ్వూరి స్మారక పురస్కారం 2022ను అందుకున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ఆచార్య టి.శోభశ్రీని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్య, సేవా రంగాలకు ఆచార్య శోభశ్రీ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితులలో అనేకమందికి సహాయ సహకారాలు అందించిన ఆమెను గుర్తిస్తూ పురస్కారం అందించడం అభినందనీయమని అన్నారు. ఇటీవల కడియంలో నిర్వహించిన దువ్వూరి సుబ్బమ్మ జయంతి వేడుకలలో ఆచార్య శోభశ్రీకి దువ్వూరి స్మారక పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు.

**NOTICE UNDER ORDER 21 RULE 64 OF CPC**
**IN THE HONOURABLE COURT OF THE**
**VII ADDITIONAL DISTRICT JUDGE AT**
**VISAKHAPATNAM**
**A.A.19 OF 2016 EP 74 OF 2018**

**Between:**
M/s.Shriram Transport Finance Company Ltd.,
Dwaraka Nagar, Visakhapatnam rep., by its
G.P.A.Holder: M.V.Ravi Kumar ...DHr
**And:**
1.S.Pavani
2.S.Shashi ...JDrs

**Notice to 1st Jdr**

S.Pavani D/o Shashi Sandilya,
D.No.11-8-37/6, F.No.687,
Park View Apartments, Visakhapatnam

Whereas you have failed to satisfy an Award passed against you on 19-03-2016 in the A.A.19/2016 in favor of the Dhr for an amount of Rs.2,54,32,334/- and the DHr filed the above Execution Petition for Execution of the Award praying the Honourable court to order for attachment of the schedule property as per the provisions under Order 21 rule 54 there by sale of the property under the provisions in CPC to satisfy the Award amount of Rs.2,74,12,763/- and the attachment made absoulte by the Honourable court.

Where as it is ordered that notice under Order 21 rule 64 of CPC and it is also ordered that you should attend to the court on **01-12-2022** to take notice of the date for fixing settlement of terms of the proclamation of the sale.

**Given under the seal of the court:**
**Warrant Amount: 2,74,12,763/-**
**Schedule of the property**

All that house bearing door No 11-8-37/6, covered by S.No. 1197/part bearing plot no 92, in park view apartment situated at Daspalla layout, Daspalla Hills, Visakhapatnam, bounded as follows :

**EAST by** : Plot No 90-a
**WEST by** : 30 feet wide road
**NORTH by** : Plot No 91
**SOUTH by** : Plot NO 93

**Y.VIJAYA SARADHI,** Advocate,
Satyam, 53-40-35/1, KRM Colony, Maddilapalem,
Visakhapatnam. Cell: 9494203040

## 'నాడు నేడు' పనుల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : 74వ వార్డులో వియ్యపువాని పాలెంతోపాటు వార్డు పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు నిధులతో చేపడుతోన్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి గ్రామ పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని, వైసిపి వైప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాడునేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు ఎన్వై నాయుడు, హెచ్ఎం బిఇఎం లక్ష్మి, టీచర్స్ జి.రమేష్, టిపిబి లత, ఆర్‌పి వరలక్ష్మి, వియ్యపు కిషోర్, మొల్లి రాజేష్, కొన వెంకటరావు పాల్గొన్నారు.

## వారపుసంత ఆశీలు వసూలుకు వేలం

ప్రజాశక్తి-పద్మనాభం :మండలకేంద్రమైన పద్మనాభంలో ప్రతిబుధవారం జరిగే వారపుసంతలో ఆశీలు వసూలుకు బుధవారం స్థానిక సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. ధరావత్తు చెల్లించి పది మంది వేలం పాటలో పాల్గొనగా, వారికి ఎక్కువ మొత్తానికి రూ.లక్ష 15వేలకు వేలం పాడిన డి.వెంకటలక్ష్మి పేరున వేలం ఖరారు చేసి అప్పగించినట్లు గ్రామకార్యదర్శి రఘు తెలిపారు.

## 23లోగా దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్ దయాల్‌భాగ్ ఇనిస్టిట్యూట్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఇనిస్టిట్యూట్ ఇన్‌ఛార్జి దక్షిణామూర్తి తెలిపారు. పదోతరగతి అర్హతతో డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, ఎలక్ట్రీషియన్, 8వ తరగతి విద్యార్హతతో బ్లాక్ ప్రింటింగ్, టై అండ్ డై కోర్సులకు ఈ నెల 23లోగా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99633 40611ఫోన్ నెంబరుకు సంప్రదించాలన్నారు.

## పిహెచ్‌సి అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-పద్మనాభం : పిహెచ్‌సి అభివృద్ధికి, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది సహకరించాలని ఎంపిపి కె.రాంబాబు కోరారు. బుధవారం రేవిడి పిహెచ్‌సిలో డాక్టర్ కె.స్వప్న ఆధ్వర్యంలో పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాడైన పిహెచ్‌సి భవనాన్ని తొలగించి, అందులోని సామగ్రి వేలం వేయాలని, ఆసుపత్రి ప్రాంగణాన్ని ప్రతిరోజూ శుభ్రపరచడానికి తాత్కాలిక వర్కర్‌ను నియమించాలని తీర్మానించారు. సమావేశంలో తహశీల్దార్ లోకేశ్వరరావు, వైసిపి నేత కోన రమణ, సూరప్పుడు, శ్రీనివాస్, అప్పారావు పాల్గొన్నారు

## ఘనంగా కాలభైరవ అష్టమి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానానికి అనుబంధ దేవాలయమైన కాలభైరవస్వామి ఆలయంలో బుధవారం భైరవాష్టమిని ఆలయ సిబ్బంది అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏడాదికోసారి నిర్వహించే ఈ వేడుకలో భారీగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఎస్‌సి,ఎస్‌టి రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన సభ్య ఉద్యోగులను బుధవారం అసోసియేషన్ కార్యాలయం వద్ద సన్మానించారు. ముందుగా బాబాసాహెబ్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, బిర్సాముండా విగ్రహాలకు హెచ్ఆర్ విభాగ జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. 62 మందికి రూ.20వేల చొప్పున రూ. 12.50లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బోండా తౌడన్న, బయ్యే మల్లయ్య, అడ్వైజరీ కమిటీ ప్రతినిధి బూల జగ్జీవన్ –రామ్, చిరంజీవి, బూక్య లాలు, దాకే సువర్ణరత్నం, కెవివి సుబ్రమణ్యం, కారు రమణ, కర్రా ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్‌వి రమణ రావు, సెక్రటరీ ఎస్.మోహన్‌బాబు, పుల్లారావు , కోశాధికారి కెవి రత్నం, బిడి నాయక్, లక్ష్మణమూర్తి, పైడి కొండలరావు, మోరి గణేష్, కిషోర్ సింగ్, వేణు గోపాలరావు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి -ఆనందపురం: గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించి, ఇంటింటికీ వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ భావిశెట్టి భారతమ్మ అన్నారు. కార్యక్రమంలో భాగంగా పెద్దిపాలెంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్, 104 వైద్యాధికారి డాక్టర్ ఆర్ మన్మోహన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి, 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యపరీక్షలు జరిపారు. గర్భిణులకు ఇసిజి, బాలింతలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అంగన్వాడీ, పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి .సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్, డిపిఎంఒ ప్రసాదరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సన్యాసిరావు, సిహెచ్ఒ మీసాల దివ్య, భార్గవి, రోగ్య కార్యకర్తలు వరలక్ష్మి, సూర్య నరసయమం,. జ్ఞానేశ్వర రావు, ఆరోగ్య కార్యకర్తలు సోములమ్మ, షేక్ ఖాసిం, కుసుమ, జ్యోతి,104 పైలెట్ షేక ఖాసిం పాల్గొన్నారు.

## 18నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కోచ్‌తో ఉక్కు కబడ్డీ క్లబ్ క్రీడాకారులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : ఉక్కునగరం కబడ్డీ క్లబ్ మొదటి వార్షికో త్సవం సందర్భంగా ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించ నున్నట్లు కోచ్ కారి లక్ష్మణరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఉక్కునగరం తృష్ణ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సెక్రటరీ జెఎస్‌వి.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ టోర్నీకి జిల్లా వ్యాప్తంగా 30 జట్లు వస్తున్నా యన్నారు. ఉక్కునగరంలో సింథటిక్ మాట్‌పై మొదటిసారి నిర్వహించే పోటీల్లో విజేతలతో సహా మొదటి నాలుగుస్థానాల్లో నిలిచిన జట్లకు, వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆర్థిక బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ క్లబ్ జాయింట్ సెక్రెటరీ సిహెచ్ గోవింద్, వైస్ ప్రెసిడెంట్ వైవి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ అప్పలరాజు, ధనరాజు, సురేష్, భూలోక పాల్గొన్నారు

## శ్రీనివాస ప్రసాద్‌కు డాక్టరేట్

శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ పరిధిలోని చిన ఉప్పాడకు చెందిన మైలపల్లి శ్రీనివాస ప్రసాద్‌కు ఆంధ్రా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. 'విశాఖ డిస్ట్రిక్ట్ ఏ కంపేరిటివ్ అనాలిసిస్' పేరిట సమర్పించిన పరిశోధనా పత్రాలకు శ్రీనివాస్‌కు ఎయు డాక్టరేట్ ప్రకటించింది.

# నేరాలు ఘోరాలు

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

### -నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పిఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన బంగారం దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్‌లో మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ, ఎంవివి సిటీ బ్లాక్ నెంబర్ 9లో నివాసం ఉంటున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కాంగ్రేగుల పూర్ణిమ ఇంట్లో 94 తులాల బంగారం, 123 తులాల వెండి ఆభరణాలు, 50 వేలు నగదు కలుపుకుని మొత్తం రూ.24 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు చేసిన ఫిర్యాదుపై ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. పని మనుషులు మేరగాన చంద్రకళ, గంట్యాడ జ్యోతిలను నిందితులుగా నిర్ధారించారు. వీరిద్దరూ పూర్ణిమ వద్ద ఎంతో నమ్మకంగా ఉంటూ, వారు ఇంట్లో లేని సమయంలో దఫాదఫాలుగా 94 తులాల బంగారం ఆభరణాలు, 50 వేలు నగదు, 123 తులాల వెండి ఆభరణాలు దొంగలించారని తెలిపారు. నిందితులను బుధవారం మధురవాడలోని పిలకవానిపాలెం వద్ద అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 11 తులాల బంగారం, 103 తులాల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే అమ్మివేసిన బంగారాన్ని విజయనగరం వర్తకుడు పాతం భాస్కరరావు నుంచి 37 తులాలు, విశాఖపట్నానికి చెందిన వర్తకుడు మల్లవోలు వెంకట త్రినాథ్ గుప్తా నుంచి 37 తులాలు బంగారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కమిషనర్ తెలిపారు. మొత్తంగా 85 తులాల బంగారం, 123 తులాల వెండి ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసు ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నార్త్ డివిజన్ క్రైమ్ సిఐ డి.రమేష్, పిఎం పాలెం, పద్మనాభం క్రైమ్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## 17 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అగనంపూడి సమీపంలోని డొంకాడ వంతెన వద్ద పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేసి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,11,530 నగదు, 17 సెల్ ఫోన్లు, 5 బైకులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం స్టీల్ ప్లాంట్ పోలీసులకు అప్పగించినట్లుఏసిపి త్రినాధరావు తెలిపారు.

## బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు గ్రామ సమీపంలో బుధవారం సాయం త్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. చీమలపాడు శివారు ములకలపల్లి గ్రామానికి చెందిన బోండా జోగేష్, తన బంధువైన మజ్జి నాగేశ్వరరావుతో కలిసి బైక్‌పై రోలుగుంట మండలం గెరెంపేటలో వెళ్లి తిరిగొస్తుండగా, చీమలపాడు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో జోగేష్‌కు ముఖంపై గాయాలు తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. నాగేశ్వరరావు కుడి కాలు విరిగింది. క్షతగాత్రులకు స్థానికులు సపర్యలు చేసి, 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## నాలుగు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: నాలుగ లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు కెడిపేట ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. ఎల్ఎపురం గ్రామానికి చెందిన లోవరాజు కొత్త బంగారంపేట దగ్గర సారా తయారు చేసి, నాలుగు లీటర్లతో వస్తుండగా శివాలయం సమీపంలో బుధవారం ఉదయం పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనట్లు తెలిపారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

అంత్యక్రియలు నిర్వహిస్తున్న దుర్గ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ కాలనీ, 40 గజాల ప్రాంతం, జివిఎంసి షెడ్డులో ఉంటున్న బంగారి మోహనరావు(72) అనే అనాథను అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న బొమ్మల దుర్గ మానవత్వంతో ఆదుకున్నాడు. కొన్నాళ్లుగా రెగ్యులర్‌గా ఆహారం అందించిన ఆమె, అతనికి అనారోగ్యం చేయడంతో మహిళా పోలీసు సహకారంతో కెజిహెచ్‌లో చేర్పించింది. ఆరోగ్య విషమించి కెజిహెచ్‌లో మృత్యువాత పడడంతో,ఆరిలోవ పోలీసుల సహకారంతో ఆ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి దుర్గ మానవత్వం చాటుకున్నాడు. .

# గ్రంథాలయాలను వినియోగించుకోండి

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రమాదేవి


మల్కాపురంలో జెడ్‌జిఎస్ చైర్మన్ రమాదేవికి సత్కారం

ప్రజాశక్తి- ములగాడ : గ్రంథాలయాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి అన్నారు. బుధవారం మల్కాపురం శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాల యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే గ్రంథాలయానికి ఎయిర్ కండిషన్ సదుపాయం కల్పిస్తామన్నారు. వైసిపి యూత్ జిల్లా అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ, గ్రంథాలయానికి ఉచితంగా 30 కుర్చీలను బహూకరించిన రామును అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్.వెంకట్రావు, జిజివి.రాజు, సత్తిరాజు, బి.సత్యానందం, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఐపిఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ పి.నూకరాజు, దాత రాము పాల్గొన్నారు. ముందుగా గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న జాతీయ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్, రాష్ట్ర గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం తదితరుల చిత్రపటాలకు కొండా రమాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెయింట్ ఆన్స్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.

**పెందుర్తి :** గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పెందుర్తి శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.సూర్యకళ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.జెడ్‌పి హైస్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, నవ్య వికాస్ పాఠశాలలకు చెందిన 142మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యవేక్షకులుగా టీచర్లు దాసరి సత్యం, ఎన్.ప్రభాకర్, పిఇటి జి మాధురి వ్యవహరించారు. 17న సాహితీ సమ్మేళనం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ బి. సూర్యకళ తెలిపారు.

**సింహాచలం:** అడవివరం గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ నేతలు ఎస్ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఇతర నేతల చిత్రపటాలకు లైబ్రేరియన్ నరసింహం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. రీడర్స్ ఫోరం అధ్యక్షులు రచయిత జోగారావు, బిబి రాజేంద్రప్రసాద్, భాను. రామకృష్ణ ఏడుకొండలు, మధు పాల్గొన్నారు.

**సీతమ్మధార:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పౌర గ్రంథాలయంలో బాలల చిత్ర ప్రదర్శన నిర్వహించారు. స్వరమాధుర్య కచేరి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ అంబేద్కర్ మెమోరియల్ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు

**మాధవధార** : గ్రంథాలయ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎన్ఆర్ పార్కు అధ్యక్షుడు అన్నపు నారాయణరావు అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను మాధవధార ఎంఎన్ఆర్ పార్కులో ఆవిష్కరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వమించే పుస్తక ప్రదర్శన, వ్యాసరచన; క్విజ్ చిత్రలేఖనం, ఇతర పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# సచివాలయాన్ని తరలించొద్దు!

## మండల పరిషత్ వద్ద ముచ్చర్ల వాసుల ధర్నా
## గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

గాంధీజీకి వినతిపత్రం అందిస్తున్న ముచ్చర్ల గ్రామస్తులు

ప్రజాశక్తి -ఆనందపురం: రికార్డుల్లో ముచ్చర్ల పేరుతో ఉన్న సచివాలయాన్ని కణమాం తరలించే చర్యలను మానుకోవాలని, ముచ్చర్లలోనే సచివాలయ భవనం నిర్మించి, ఇక్కడే సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ముచ్చర్ల సచివాలయాన్ని కణమాం తరలించడాన్ని నిరసిస్తూ ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అలాగే ఇఒపిఆర్‌డి ఆంజేయులకు వినతిపత్రాన్ని అందించారు. ప్రజాశక్తిలో ఈనెల 14న సచివాలయంఏర్పాటుపై వివాదం శీర్షికతో వచ్చిన కథనానికి గ్రామస్తుల్లో కదలిక వచ్చింది. ఈ సందర్భంగా సర్పంచ్ శినగం ఎర్రయ్య, ఇతర గ్రామస్తులు మాట్లాడుతూ, మండలంలో 26 పంచాయతీలకు ఏర్పాటు చేసిన 18 సచివాలయాల్లో ముచ్చర్ల ఉందని, ఇపుడు భవన నిర్మాణాలను వచ్చేసరికి, ముచ్చర్ల పేరును మాయం చేసి, కణమాంలో కొనసాగించేలా చర్యలు చేపట్టడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కణమాంలో కావాలంటే వేరే సచివాలయాన్ని కొత్తగా ఏర్పాటు చేసుకోవాలని, ముచ్చర్ల పేరుతో ఉన్న సచివాలయాన్ని ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీ విషయంలో రాజకీయాలు చేసి అన్యాయం చేస్తే, గ్రామస్తులంతా సంఘటితమై బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తక్షణమే ముచ్చర్లలో సచివాలయ సేవలు కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ లంక అప్పలనారాయణ, లంక రమణ, మాజీ ఎంపిటిసిలుపాండ్రంకి గంగరాజు, సినగం శివ, గుషిడి ముత్యాలు, జనసేన నాయకులు శినగం బంగారు నాయుడు, యువకులు లెంక శివాజీ, గంగునాయుడు, పాండ్రంకి శివసత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేపై అవగాహన

మాట్లాడుతున్న ఎంపిపి వాసురాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి నగరపాలెం సచివాలయం వద్ద బుధవారం సమగ్ర భూముల రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ, భూములు కొనుగోలు చేసిన వారు, భూయజమాని మృతి చెందితే వారసుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదుకు అలాగే ఉమ్మడి కుటుంబంలో ఉన్నవారు విడిపోతే, వారి పేరిట భూముల వివరాలు నమోదు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, రీ సర్వేపై ఉన్న సందేహాలుంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపిటిసి పల్లా నీలిమ, విఆర్‌ఒ రఘునాథ్, పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మ్యుటేషన్ కోసం 65 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన చొక్కాకుల



సిఎం జగన్‌తో చొక్కాకుల

ప్రజాశక్తి- సీతమ్మధార : తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిర్వహించిన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమీక్షా సమావేశంలో పాల్గొన్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు సిఎం జగన్‌కు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతకు కృషిచేయాలని సిఎం సూచించారని వెంకటరావు తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నీ ప్రారంభిస్తున్న ఉపకార సంస్థ అధినేత అచ్యుతరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కైలాసగిరి పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీని ఉపకార సంస్థ అధినేత కంచర్ల అచ్యుతరావు ప్రారంభించారు. అంతకుముందు సూపర్ స్టార్ క్రిష్ణ చిత్రపటానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సినీ దర్శకులు యాద్ కుమార్, మేనేజర్ బాలగంగాధర్, నగేష్, సుధీర్, కళాకారులసంఘం ప్రతినిధి కె.జనార్ధన్ పాల్గొన్నారు.

## జన జాగృతి యాత్రకు విశేష స్పందన

లక్ష్మీనరసింహను స్వాగతిస్తున్న వార్డు ప్రజలు

ప్రజాశక్తి -మాధవధార : బడుగు బలహీన వర్గాల జన జాగృతి యాత్రలో భాగంగా ఉత్తర నియోజకవర్గం బిసి నాయకులు సనపల లక్ష్మి నరసింహ 46వ వార్డు కైలాసపురం, కస్తూరి నగర్ దుర్గగుడి నుంచి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు ప్రజలు మేళతాళాలతో లక్ష్మీనరసింహానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసింహ మాట్లాడుతూ వార్డులోని సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# ఎన్ఎస్‌టిఎల్‌లో వాలీబాల్ టోర్నమెంట్

మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

ప్రజాశక్తి -కరాస: ఎన్ఎస్‌టిఎల్‌లో డిఆర్‌డిఒ సెంట్రల్ జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ నెల 16 నుంచి 18వరకు నిర్వహించనున్న టోర్నీలో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సిబ్బంది సాధారణ కార్యకలాపాలతో పాటు ఫిట్‌నెస్‌కు సంస్థ అధికప్రాధాన్యతినిస్తుందన్నారు. హైదరాబాదులోని అడ్వాన్స్ సిస్టం లేబరేటరీ (ఎఎస్ఎల్) ,డిఫెన్స్ ఎలక్ట్రానిక్ రీసెర్స్ లాబరేటరీ (డిఎల్ఆర్ఎల్), రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సిఐ), డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లాబరేటరీ (డిఆర్‌డిఎల్), డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లేబరేటరీ (డిఎంఆర్ఎల్) ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ బాలాసోర్ (ఐటిఆర్), ప్రూఫ్ అండ్ ప్రయోగాత్మక స్థాపన (పిఎక్స్ఈ)జట్లు టోర్నీలో పాల్గొంటున్నట్టు తెలిపారు. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో టోర్నీలో 12 మ్యాచులు, రెండు సెమీఫైనల్, ఒక ఫైనల్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సైంటిస్ట్ డాక్టర్ మను కోరిల్ల, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# ఫిట్స్ నియంత్రణకు మందులు

## కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ విజయ్‌కుమార్

డాక్టర్ సిహెచ్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి -గాజువాక :ఫిట్స్ నియంత్రణకు మందులు అందుబాటులోకి వచ్చాయని కిమ్స్ ఐకాన్ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫిట్స్ (మూర్ఛవ్యాధి)ని గుర్తించడం కీలకమని, తర్వాత చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. మందులతో తగ్గని ఫిట్స్‌కు ఆపరేషన్,ఫేస్ మేకర్ ద్వారా తగ్గించవచ్చన్నారు. ప్రతి వెయ్యి మందిలో నలుగురికి ఫిట్స్ ఉంటుందన్నారు. - సాధారణంగా రెండేళ్లలోపు పిల్లలకు, 50-60 ఏళ్ల వారికి ఫిట్స్ వస్తుందన్నారు. మెదడులోని ఒక బ్రెయిన్ కు అవసరానికి మించి శక్తి ప్రసారం కావడమే ఫిట్స్‌కు కారణ మన్నారు. ఫిట్స్ వ్యాధి నిర్ధారణకు ఇసిజి పరీక్ష నిర్వహిస్తామని, అసాధారణ విద్యుత్ శక్తి ఏ భాగానికి

# జలజీవన్ మిషన్ నిధులు ఏమైనట్టు!

## గ్రామసభలో ప్రశ్నించిన వార్డు సభ్యుడు, ప్రజలు

సమస్యలతో కూడిన వినతిపత్రం ఇస్తున్న ప్రశాంత్, శివకృష్ణ

ప్రజాశక్తి -ఆనందపురం: జల జీవన్ మిషన్ పథకం కింద నిధులు మంజూరైనా ఇంకా పనులెందుకు ప్రారంభించలేదని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామస్తులు, వార్డు సభ్యుడు తాడివాడ ప్రశాంత్, శివకృష్ణ పంచాయతీ అధికారులను నిలదీశారు. బుధవారం గొట్టిపల్లిలో నిర్వహించిన గ్రామసభలో శివకృష్ణ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం కింద వెంకటాపురం గ్రామానికి రూ.16 లక్షలు, భీమల వెంకటాపురం గ్రామానికి రూ.14 లక్షలు నిధులు మంజూరైనా నేటికీ పనులు చేపట్టలేదని, దీనిపై వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. పంచాయతీ పరిధిలో రోడ్లు డ్రైనేజీలు, వీధి దీపాలు, శ్మశానవాటికకు రోడ్డు, అపారిశుధ్యం ఇతరత్రా సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, వీటిల్లో ఏ ఒక్కటీ పరిష్కరించడం లేదన్నారు. తక్షణమే స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ కార్యదర్శి సురేష్, సర్పంచ్ గంటా జగదీష్‌కు అందజేశారు

## 18న జాబ్‌మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్లో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి( టెక్నికల్) కె .సుధ తెలిపారు. ది పార్క్ హోటల్, రిలయన్స్ జియో, ఎస్‌బిఐ, బ్యాంకు ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, కోటక్ మహీంద్రా, పేటిఎం, స్విగ్గీ వంటి కంపెనీల్లో వెయ్యి ఉద్యోగాల భర్తీలు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు

ట్రైనీలు, హోమ్ సేల్స్ ఆఫీసర్, బ్రాంచ్ రిలేషన్ షిప్ మేనేజర్, ఫ్రంట్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్స్ ప్యాకర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 -45 ఏళ్ల స్త్రీ, పురుష అభ్యర్ధులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి రూ.12,500 నుంచి రూ.20,500 వరకు నెలసరి జీతం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ncs.gov in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

**నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో...**

కంచరపాలెం ఐటిఐ జంక్షన్‌లోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎన్.శ్యాంసుందర్ తెలిపారు. మారుతి సుజుకి, జయభేరి ఆటోమొబైల్స్ కంపెనీల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ టెక్నీషియన్, సర్వీస్ అడ్వైజర్, టెలికాలర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఉద్యోగాన్ని బట్టి రూ.13,500 నుంచి రూ.26 వేలు వరకు జీతం ఉంటుందన్నారు .ఆసక్తి గల అభ్యర్థులు అఎం ప్రశీజ అల సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

## నిర్వాసిత కాలనీల అభివృద్ధికి చర్యలు

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : నిర్వాసిత కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బుధవారం 87వ వార్డు వడ్లపూడి ఏరియాలో రూ.40 లక్షలలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలోని అన్ని పాఠశాలలను నాడునేడు నిధులతో అభివృద్ధి చేశామన్నారు. త్వరలోఅన్ని పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాలకు కేటాయించిన రూ.20 లక్షలతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కోమటి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బొడ్డ గోవింద, దానప్పలు, దామోదర్, ఇంజనీర్ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

## జిరాయితీలో జగనన్న కాలనీ సరికాదు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీలో గెద్ద సూర్యనారాయణకు చెందిన 30 సెంట్ల సొంత భూమిని జగనన్న కాలనీకి ఎంపిక చేయడం సరికాదని భీమిలి నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి కంటుభుక్త రామానాయుడు అన్నారు. దీనిపై స్వయంగా పరిశీలించిన తర్వాత తహశీల్దార్ లోకేశ్వరరావును కలిసి సమస్యను విన్నవించి పరిష్కరించాలని కోరారు.

## శారదా పీఠాన్ని సందర్శించిన జియ్యాని

స్వరూపానందేంద్ర సరస్వతి స్వామికి ఆహ్వానపత్రిక అందజేత

ప్రజాశక్తి- పెందుర్తి :విశాఖ శారదా పీఠాన్ని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం సందర్శించారు. శాంతీనగర్ శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ 25వ షష్టి ఆహ్వాన పత్రికను దేవాలయ ధర్మకర్తలతో కలిసి వెళ్లి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి అందజేశారు. అనంతరం రాజ శ్యామలమ్మను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# 17వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి
తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవల్ బేస్ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ మెయిన్ గేట్ ముందు రోడ్డుపై బైఠాయించి వేలాదిమంది నిర్వాసితులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది గ్రామాల పెద్దలు మాట్లాడుతూ నేవీ గేట్లు వెంటనే తీయాలని, ఆధార్ కార్డు ఆధారంతో లోపలకు పంపించాలి, వెంటనే జెట్టీ నిర్మాణం చేయాలని, పెండింగ్ ప్యాకేజీలు క్లియర్ చేయాలని, మగవాళ్లతో సమానంగా మహిళలకు ప్యాకేజీ ఇవ్వాలని, నేవల్ బేస్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే వేలాది మందితో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది నిర్వాసితులు పాల్గొన్నారు.

నేవీ గేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎన్ఎఒబి నిర్వాసితులు

డిఇఒకు పుష్ప గుచ్ఛంతో అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## డిఇఒ లింగేశ్వరరెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి విజయనగరం జిల్లాకు బదిలీ కావడంతో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా నాయకత్వం బుధవారం కలిసి ఆయనకు అభినందనలు తెలియచేసింది. అనకాపల్లి జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి లింగేశ్వరరెడ్డి చేసిన కృషికి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి పాల్గొన్నారు.

విజన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న తిరుపతిరావు

## సామాజిక నేత్ర ఆరోగ్య విజన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- చోడవరం : చోడవరంలో ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన సామాజిక నేత్ర ఆరోగ్య విజన్ సెంటర్‌ను బుధవారం రిటైర్డ్ ఆర్‌జెడి తిరుపతిరావు ప్రారంభించారు. చోడవరం కో-ఆపరేటివ్ కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కళ్యాణ మండపం ఎదురుగా నూతన భవనంలో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ అవయవాల్లో కళ్ళు ప్రధానమైనవని, వాటిని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. వయసు మీద పడిన వారు కంటి సమస్యలతో బాధపడతారని, అటువంటి వారికి ఇటువంటి సెంటర్లు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. ఉమామహేశ్వరరావు, రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఇఒ అప్పలరాజు

## 'కౌశల్'లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10న మండల స్థాయిలో ఆన్లైన్‌లో నిర్వహించిన 'కౌశల్-2022' పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9, 10 తరగతి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. డి.లహరి (10వ తరగతి) 30/40 మార్కులు, బి.మోన్విత (9వ తరగతి) 38/40, బి.సుహాసిని (8వ తరగతి) 41/45, మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 109/125 మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించినట్లు చ హెచ్ఎం సిహెచ్. చిన్నమ్మాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ఆన్లైన్‌లో జరిగే జిల్లాస్థాయి కౌశల్ -2022 పరీక్షలకు వీరు హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ విద్యార్థులకు ఎంఇఒ ఎస్.అప్పలరాజు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

## ఖోఖో పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : ఇటీవల ప్రకాశం జిల్లా సీదర గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో సీనియర్ విభాగం పోటీలో మండలంలోని సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు జ్యోతి స్వరూప్, బి.మాధురి ప్రతిభ కనబర్చారు. వీరిని పాఠశాలలో బుధవారం స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ఎల్ శ్రీనివాసరావు అభినందించారు.

## సూపర్ స్టార్ కృష్ణకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : సూపర్ స్టార్ కృష్ణ మతి చెందిన నేపథ్యంలో మండలంలోని తుమ్మపాల గ్రామంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు, కృష్ణ అభిమాన సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్, గంగాజలం, కనుబుట్టి రామకోటి, చిరంజీవి, మురళి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో పోలీసు స్టేషన్ భవనాల ప్రారంభం

**జిల్లా ఎస్‌పి గౌతమిశాలి**

పోలీసు స్టేషన్ కొత్త భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి గౌతమిశాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు
జిల్లాలో నూతనంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న కె.కోటపాడు, గొలుగొండ పోలీస్ స్టేషన్ భవనాలను ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో ప్రారంభిస్తామని జిల్లా ఎస్పీ గౌతమిశాలి తెలిపారు. బుధవారం కె.కోటపాడు పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. కె.కోటపాడులో పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం రాత్రిపూట గస్తీ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో గతం కన్నా క్రైమ్ రేటు తక్కువగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆమె వెంట సిఐ తాతారావు, ఎస్సై ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన దుర్గాప్రసాద్, వేచలం పాఠశాల విద్యార్థులు

# అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - దేవరాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దేవరాపల్లి మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 11న అనకాపల్లి ఏఎంఏఎల్ కాలేజీలో పాఠశాల స్థాయి గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలుర అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో దేవరాపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కక్కల దుర్గాప్రసాద్ 200, 400 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, డిస్కు త్రోలో ప్రథమ స్థానం సాధించగా, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పాండురంగారావు తెలిపారు. దుర్గాప్రసాద్‌ను, తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు టి.నాగేశ్వరరావును హెచ్ఎం పాండురంగారావుతో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

**వేచలం విద్యార్థుల ప్రతిభ**

జిల్లా అథ్లెటిక్స్ క్రీడల్లో మండలంలోని వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో రన్నింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాలు సాధించారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు సుధారాణి, స్నేహ, అను ఎంపికయ్యారు. విద్యార్థులను, పిడి తమ్మునాయుడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవుపల్లి నరసింహమూర్తి, సర్పంచ్ నాగిరెడ్డి శరాంనాయుడు, ఎంపిటిసి సభ్యులు లక్ష్మీ బలరాం, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస్, అభినందించారు.

## కోతుల నివారణకు చర్యలు : ధర్మశ్రీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-వడ్డాది : పంటలను కోతులు పూర్తిగా నాశనం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అటవీశాఖ అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడి వాటి నివారణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలో బుధవారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతుల వల్ల సుమారు 14 గ్రామాల్లో రైతులు పూర్తిగా వ్యవసాయం వదిలేశారన్నారు. గతేడాది 2000 వరకు ఉన్న కోతులు, ఈ ఏడాది సుమారు 8000కి పైగా ఉన్నాయని తెలిపారు. వాటి సంతానం చాలా ఎక్కువగా పెరిగిందని, ఇలా అయితే రైతులు ఎప్పటికీ వ్యవసాయం చేయలేరని పేర్కొన్నారు. కోతుల నివారణకు సుమారు రూ.50 లక్షల ఖర్చు అవుతుందని అంచనా వేశారని, ఎంపీ నిధులు, ఎమ్మెల్యే నిధులు, అటవీశాఖ నిధులు జోడించి విశాఖ డెయిరీ సహకారంతో వాటిని దూరప్రాంత అడవుల్లో వదిలిపెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో డిపిఒ ఉషారాణి రేంజర్ రాజు, జెడ్పిటిసి దొండా రాంబాబు, ఎంపీపీ దాకావరపు నాగేశ్వరి దేవి, వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి ఎండిఒ సువర్ణ రాజు, తహశీల్దారు అంబేద్కర్, రైతు సంఘం నాయకులు తమరాన వెంకటరమణ, కో-ఆపరేటివ్ అధ్యక్షులు సాయం రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్కమ్మ చెరువు ఆయకట్టు రైతుల ఆందోళన

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 293లో సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణం గల అక్కమ్మ చెరువు మీదగా నూకాలమ్మ కాలనీ రోడ్డు వరకు రహదారి నిర్మాణాన్ని నిరసిస్తూ ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కొంతమంది అడ్డగోలుగా ఈ రోడ్డు నిర్మాణ పనులకు పునుకోవడంతో దారుణమని అక్కమ్మ చెరువు జల ఆధార ఆయికట్టు రైతుల అభివృద్ధి సంఘం ప్రతినిధులు కోరుకొండ పెంటారావు, గంటా నాగభూషణం తదితరులు పేర్కొన్నారు. ఈ విషయమై అటు రెవెన్యూ అధికారులకు ఇటు పంచాయతీ అధికారులకు తెలియజేసినా, నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు తప్పా జరుగుతున్న పనులను నిలుపుదల చేయలేదని ఆరోపించారు. ఈ చెరువుగట్టుపై నుండి రోడ్డు నిర్మాణం చేస్తే చెరువులోకి నీరు చేరడం కష్టమవుతుందని, ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జివి.రమణ వివరణ కోరగా ఎటువంటి పనులు జరగలేదని, ఇప్పటికే వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిని పంపినట్లు చెప్పారు.

## ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తా : పైలా

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి గ్రామంలో శిథిలావస్థలో వున్న శ్రీకృష్ణ విగ్రహం స్థానంలో కొత్తగా ఆలయ నిర్మాణానికి స్థానికుల విజ్ఞప్తి మేరకు తన వంతు ఆర్థిక సాయం అందిస్తానని టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు హామీ ఇచ్చారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు బుధవారం ఆయన చింతలపూడి గ్రామాన్ని సందర్శించి, శ్రీకృష్ణ విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దాయిరి దేముడు, దాయిరి లక్ష్మణ్, ములగం నారాయణ, కోసూరి నాగమయ్య, దాయిరి మల్లేష్, దాసు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పడమటమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోటలో ఉన్న శ్రీపడమటమ్మతల్లి అమ్మవారి సారె ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి మహిళలు పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కలగా శివానందం, గొంతున ఆప్పాజీ, తాళ్లపల్లి శ్రీనివాసరావు, సురా భాస్కర్‌రావు, నడిపల్లి సన్యాసి, వేగి వెంకట్రావు, ఎంవిఆర్ యువసేన సభ్యులు, పాల్గొన్నారు.

సారె ఊరేగింపులో పాల్గొన్న ముత్యాల వెంకటేశ్వరరావు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

## నాడు-నేడు పనులు వేగవంతం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** నాడు నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నాడు నేడు పనులపై సమీక్ష సమావేశం ఎంపిడిఒ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. తాసిల్దార్ గంగాధర్ రావు, ఎంఈఓ దివాకర్, నాడు నేడు పనులు చేస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీ పాఠశాలల హెచ్ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

## వరిలో మానిపండు, సుడిదోమపై జాగ్రత్తలు

**ప్రజాశక్తి- కశింకోట :** వరిపంటకు సుడిదోమ, మానిపండు తెగులు సోకాయని, వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు అన్నారు. మండలంలోని ఎఎస్ పేట, జె తుని గ్రామాల్లో వరిపంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడిదోమ నివారణకు 1.20 గ్రాముల మెట్రిజన్ ఎకారకు, మాని పండు తెగులు నివారణకు పప్రోకోన్జోల్ 200 మీల్లీలీటర్లు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న, సిబ్బంది వి.హేమ, ఎస్.పుష్ప, ఎమ్.కవిత, ఏఇఓ నూకి శ్రీను, రైతులు పాల్గొన్నారు

## నేడు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :** బుచ్చయ్యపేట పాల కేంద్రంలో గురువారం విశాఖపట్నం అనిల్ నీరుకొండ ఆసపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ సుంకర సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కళ్ళు, మూల వ్యాధి, ఎముకలు, గుండె, గైనిక్ తదితర రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## సమగ్ర భూ రీ సర్వే ప్రారంభం

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో సమగ్ర భూ రీ సర్వేను గ్రామ సర్పంచ్ దాడి లావణ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూమి హక్కులు పొందేందుకు భూ రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, విఆర్వో నాగేశ్వరరావు, కార్యదర్శులు మానస, సత్యనారాయణ, ఉప సర్పంచ్ అంగటి సూరిబాబు, నాయకులు దాడి కన్నం నాయుడు, సిలపరశెట్టి మాలి నాయుడు, అంగటి కోటి, దార రాము తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీరింగ్ నాన్ టెక్నికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని జిల్లా ప్రజారోగ్య సాంకేతిక అధికారి కార్యాలయంలో జరిగింది. అధ్యక్షులుగా సిహెచ్.బాలకృష్ణ, కార్యదర్శిగా పి.శివరామకృష్ణ, కోశాధికారిగా బి.అవినాష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎన్ సుబ్బరాజు వ్యవహరించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

**ప్రజాశక్తి - పరవాడ :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. జివిఎంసి 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరుచేసి విడివిడిగా చెత్త డబ్బాల్లో వేసి జీవీఎంసీ వాహనానికి అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## టిడ్కో గృహాలను అనర్హులకు కేటాయిస్తే ఉద్యమం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** పేదలకు చెందాల్సిన టిడ్కో గృహాలను వైసిపి నాయకులు దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడ్కో గృహాల విషయంలో మాటతప్పిన మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను నియోజకవర్గ ప్రజలు క్షమించరన్నారు. ఈ గృహాలను అనర్హులకు కేటాయిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విశాఖకు చెందిన వారికి వెయ్యి గృహాలను అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సురేంద్ర, రత్న కుమారి, పచ్చి కూర రాము, క్లస్టర్ ఇన్చార్జి తలారి కాశి నాయుడు, మేడిశెట్టి నూకరాజు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం

### గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు

బుచ్చయ్యపేటలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.**

**ప్రజాశక్తి- చోడవరం**

చోడవరం శాఖా గ్రంధాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథ్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాల నివాళు లర్పించారు. వివిధ పాఠశాలలు నుండి వచ్చిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి జి.తిరుమల కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

**కె.కోటపాడు :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారుల సంస్కరణ దినోత్సవాన్ని నిర్వహించి, ఎస్ఆర్.రంగనాథ్. అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని కె.సౌమ్య, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కశింకోట :** తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్ఆర్. రంగనాథం చిత్రపటాలకి పూలమాలవేసి నివాళు లర్పించారు. వారు చేసిన సేవలు గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, ఉపాధ్యాయులు ఎల్.వరలక్ష్మి, ఎంవికె.హరినాథ్, గ్రంథాలయ అధికారులు కె.జగన్, ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట :** స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జాజి మొగ్గల ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.కృష్ణారావు ఉపాధ్యాయులు అప్పారావు పాల్గొన్నారు.

**మునగపాక రూరల్ :** స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాలకు మండల విద్యాశాఖ సిఆర్‌పి అచ్యుత కృష్ణ, ప్రణతి విద్యానికేతన్ కరస్పాండెంట్ సతీష్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ, ఉపాధ్యాయులు పి చక్రవర్తి, వినయ్, గణేశు సిబ్బంది దివ్య పాల్గొన్నారు.

**సబ్బవరం :** స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక సిఐ పి.రంగనాథం ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పి.వి.రమణ అధ్వరంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులు చిత్రపటాలకు సిఐ రంగనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జి.డేవిడ్ సురేష్, బి.సింహాద్రి, పాఠకులు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** గ్రంథాలయ పితామహుడు వెంకట రమణయ్య సేవలు చిరస్మరణీయమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం అన్నారు. స్థానిక శాఖవీధి శాఖ గ్రంథాలయంలో బుధవారం వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వికలాంగులకు వక్తృతం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**నక్కపల్లి :** మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రంథాలయోద్యమకారులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలకంఠ కుమార్, శ్రీదేవి, భవాని, నాగాచారి, వెంకటేశ్వరరావు, రామ సీత తదితరులు పాల్గొన్నారు. నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవింద ఈశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**రావికమతం :** మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని మాలతి, సిద్ధార్థ హైస్కూల్ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

**రోలుగుంట :** స్థానిక శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మీ తెలిపారు. రోలుగుంట, కొవ్వూరు, కొమరవోలు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

**కోటవురట్ల :** శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ప్రముఖులకు నివాళులు అర్పించారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

మునగపాకలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జిల్లాలోని రావికమతం మండలం దొండపూడి గ్రామంలో ఇటీవల మహిళను అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్ అరుణ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిందితులను దిశ, నిర్భయ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అశ్లీల చిత్రాలు, మద్యం కారణమన్నారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో అంగన్వాడి వర్కర్ దీప, ఆశా వర్కర్ ఎన్ లక్ష్మి ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి- కశింకోట :** గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎ.మేరీ జోన్స్, అధ్యక్షులుగా ఎన్.సత్యారావు, ఉపాధ్యక్షులుగా బి.చిన్నోడు, బి.సాయి గీత, కార్యదర్శిగా విఎన్‌వి సత్యనారాయణ, సహయ కార్యదర్శిగా వి.అనురాధ, కోశాధికారిగా బి.అభిషేక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఎంపిడిఒ కొంకి అప్పారావు కలిశారు.

# గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

**ప్రజాశక్తి- కశింకోట**

మండలంలోని అచ్యుతాపురం, త్రిపురవాని పాలెం గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందజేస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణుల సీమంతం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మీ, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కలిగెట్ల నూకరత్నం, వైస్ ఎంపిపి నమ్మి మీనా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోము నాయుడు, వైసిపి నాయకులు మళ్ళ బుల్లి బాబు, కలిగట్ల నాయుడు, నమ్మి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**మునగపాక రూరల్ :** మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో బుధవారం ఎలమంచిలి శాసనసభ్యులు యువి.రమణమూర్తి రాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు లబ్ధిదారులందరికీ అందేలా వాలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, సర్పంచ్ సూరిశెట్టి గంగయ్యమ్మ, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, ఉపసర్పంచ్ మందా రాము, జెడ్పిటిసి స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైస్ ఎంపీపీ చింతాడ దేవి, వైసిపి నాయకులు సూరిశెట్టి రామకృష్ణ, ఆడారి గణపతి అచ్చం నాయుడు పాల్గొన్నారు.

**సబ్బవరం :** మండలంలోని గుల్లేపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రొంగలివానిపాలెం నెక్కలవారి కల్లాలలో అంగన్వాడీ కేంద్రం, రోడ్లు, తాగునీటి కుళాయిలు కావాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, బోకం రామునాయుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సర్పంచ్ బండారు మంగ, బండారు శ్రీనివాసరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, గజ్జి దేముడుబాబు, కోటాన వెంకట రమణ, ఐడి.బాబు, గవర రాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇసుక నిల్వలు స్వాధీనం

**ప్రజాశక్తి-వడ్డాది :** బుచ్చయ్యపేట మండలం వడ్డాది రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 67లో ఉన్న పెద్దేరు గెడ్డ వద్ద అక్రమంగా రవాణాకు ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. బుచ్చయ్యపేట ఎస్సై కె.కుమార్ స్వామి సిబ్బందితో కలసి, మండల ఆర్ఐ శ్రావణ్ కుమార్, వడ్డాది వీఆర్వోలను తీసుకొని ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఇసుక పోగులు, పోగులుగా ఉండడంతో చుట్టుపక్కల వారిని అడిగినప్పటికీ ఎవరు అవి ఎవరివో ఎవరూ చెప్పలేదు. దీంతో రెవెన్యూ వారి సమక్షంలో సుమారు అక్కడ ఉన్న 18 యూనిట్లు ఇసుకను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాటలాడుతూ ఇక మీదట ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేయడానికి ప్రయత్నిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ప్రారంభం

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనాన్ని బుధవారం ఎంపిపి కోన సంధ్య బుజ్జి ప్రారంభించారు. ఐకెపి భవనం పది సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. మండల విద్యా కేంద్రం, మత్స్యశాఖ అభివృద్ధి కేంద్రం, 108 అంబులెన్స్ సేవా కేంద్రం వసతి సమస్య ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎంపిపి ఆధ్వర్యంలో గత భవనానికి మరమ్మతులు చేయించారు. ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క గది కేటాయించారు. సంబంధిత అధికారులకు ఆయా గదులను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిఆర్‌కె.దేవరాయలు, మండల పరిషత్ పరిపాలన అధికారి కృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు దేశం శెట్టి శంకర్రావు, స్థానిక సర్పంచ్ కె విమలా నాయుడు, ఎంపీటీసీ శ్రీను, లాలం వాసు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## జివిబి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** గ్రామీణ వికాస్ బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు తుమ్మపాల బ్రాంచ్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిపాజిట్‌లపై అధిక శాతం వడ్డీ, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రుణాల అందిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎంఈ రుణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు, ఎస్బిఐ లైఫ్ సంస్థతో కలసి బీమా సౌకర్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు, క్యాషియర్ కె శంకర్రావు పాల్గొన్నారు.

పర్యటిస్తున్న అనిత

## మాజీ ఎమ్మెల్యే అనిత పర్యటన

**ప్రజాశక్తి -ఎస్.రాయవరం:**ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా అనితమ్మ పల్లె పలకరింపు చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తెలిపారు. బుధవారం మండలంలోని వమ్మవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ముందుగా గ్రామదేవత మహాలక్ష్మమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను ఆలకించారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలిన ముఖ్యమంత్రి బటన్ నొక్కడమే సంక్షేమం అనుకుంటున్నారన్నారు. ప్రజలకు మంచి రోజులు రావాలంటే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట మాజీ ఎంపిపి యేజర్ల వినోద్ రాజు, మాజీ ఎంపిటిసి పల్లేల బుజ్జి, మండలపార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కోన అప్పలరాజు, అల్లు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

హాజరైన గ్రామస్తులు

## ఉపాధి హామీ గ్రామసభలు

**ప్రజాశక్తి-కోటవురట్ల:**జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలందరికీ వందరోజుల పని కనిపించాలని గ్రామ సర్పంచ్ పరదేశమ్మ, స్థానిక ఎంపీటీసీ సభ్యులు రాంబాబు సూచించారు. బుధవారం ఉపాధి ఏపీవో గంగు నాయుడు నిర్వహించిన గ్రామ సభలో గ్రామంలో చేపట్టాల్సిన పనుల వివరాలు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు పనులను గుర్తించి సభ దృష్టికి తీసుకువెళ్లారు.

నూతన కార్యవర్గ సభ్యులు

## జన విజ్ఞాన వేదిక కార్యవర్గం ఏర్పాటు

**ప్రజాశక్తి-మాడుగుల:** జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఏర్పాటు అయ్యింది. మాడుగుల డివిజన్ కమిటీ అధ్యక్షులుగా సురేష్ శాంతో, ప్రధాన కార్యదర్శిగా తాలపురెడ్డి నాగచంద్ర, కార్యదర్శి గౌరీపట్టపు మహేష్, ఉపాధ్యక్షులుగా జాగాని ఈశ్వరరావు, కోశాధికారిగా గొట్టాపు చిన్నం నాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మాడుగులలో జరిగిన సమావేశ:లో ఎన్నికై మేరకు నిర్ణయం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించారు.

## తునివలసలో అన్న సమారాధన

**ప్రజాశక్తి-చీడికాడ:**మండలంలో తునివలస గ్రామంలో గౌరీ పరమేశ్వరుల నిమజ్జన ఉత్సవాలలో భాగంగా బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలతో పాటు గ్రామానికి చెందిన భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులను గ్రామస్తులు నిమజ్జనం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల హైమ శ్రీను, నాగేష్ పాల్గొన్నారు.

## పైపుల మరమ్మతు పనులు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో వాటర్ ట్యాంక్‌కు వెళ్లే మార్గ మధ్యలో పైప్‌ల మరమ్మత్తులు చేపడుతున్నట్లు సర్పంచ్ రమణ తెలిపారు.

# ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

**ప్రజాశక్తి-మాడుగుల:**జాతీయ పత్రికా దినోత్సవం వేడుకలు బుధవారం మీడియా ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాడుగుల ఎస్సై దామోదర్ నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ శాంతో, మీడియా ప్రతినిధులు కుప్పిలి భవాని శంకర్, కరణం నారాయణరావు, రొబ్బ శ్రీనివాసరావు, ఏలూరి సురేష్, జనార్ధన్‌రావు, శాంతో అప్పలరాజు పాల్గొన్నారు

**గొలుగొండ:**జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా మండల జర్నలిస్టుల ఆధ్వర్యంలో కేడీపేటపిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం అధ్యక్షుడు సకిరెడ్డి నానాజీ, కార్యవర్గ సభ్యులు భీమిరెడ్డి సత్యనారాయణ, ఎ.వరహాలబాబు, కె.శ్రీనివాస్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. మండలంలోని పాత్రికేయులకు ఏఎల్‌పురం గ్రామంలో బుధవారం అల్లూరి వర్తక సంఘం ఆధ్వర్యాన సరుకులు పంపిణీ చేశారు.

**నర్సీపట్నం రూరల్:**ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నర్సీపట్నంలో పత్రికా ప్రతినిధులు ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మానసిక వికలాంగులకు, గర్భిణీ స్త్రీలకు, చంటి బిడ్డ తల్లులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నేలవేణి దేవి, మానసిక వైద్య నిపుణులు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని, పాడేరు జిల్లా ఆసుపత్రి సైకాలజిస్ట్ డాక్టర్ శివరామకృష్ణ,

గొలుగొండలో ఇస్తున్న సరుకులు

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సిహెచ్ బిఎల్ స్వామి, రాష్ట్ర కార్యదర్శి కిషోర్, రిపోర్టర్ చుక్కల రాము పాల్గొన్నారు.

**కోటవురట్ల:**మండల కేంద్రంలో గాయత్రి కళాశాల వద్ద పలువురు విలేకరులను డివి యువసేన ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డిబివి రాజగోపాల్, డివి యువసేన అధ్యక్షులు చామంతుల శ్రీనివాసరావు, గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ వాసు, పందూరు గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**చోడవరం :** జాతీయ పత్రికా దినోత్సవ సందర్భంగా చోడవరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక విఘ్నేశ్వర ఆలయం వద్ద స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. ఎస్ఐ నాయుడు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డివిఎం నాయుడు, సిజిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, దేవరపల్లి నవ కుమార్, సీనియర్ పాత్రికేయులు కొప్పాక భాస్కర్‌రావు, కోవెల శ్రీనివాసరావు, దాడి సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్ధికలు కొడమంచిలి చలపతి, న్యాయవాది భూమిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# టిడిపి ఆందోళన

**ప్రజాశక్తి - గొలుగొండ:** కొత్తఎల్లవరం గ్రామంలో బాధిత మహిళ వెంకటలక్ష్మీ న్యాయం చేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి వినతి పత్రం అందజేశారు. మహిళ ఇంటిని కూల్చి వేయడం తగదని, అదే స్థలంలో ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త ఎల్లవరం సర్పంచ్ కొల్లు రాంబాబు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లు సత్తిబాబు, బాధిత కుటుంబీకులు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఇల్లు కూల్చడంపై న్యాయపోరాటం**

**ప్రజాశక్తి-గొలుగొండ:**గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ పావాడ వెంకటలక్ష్మీ మీద అక్కసుతో ఓ వైసిపి నాయకుడు పని కట్టుకొని ఇల్లు కూల్చి వేయించడం అత్యంత దారుణమని, దీనిపై న్యాయ పోరాటానికి దిగుతామని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన

మాట్లాడుతున్న టిడిపి నేతలు

వీరసూర్యచంద్ర హెచ్చరించారు. బుధవారం కూల్చి వేసిన మహిళ ఇల్లును సందర్శించారు. అనంతరం మహిళ కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, కొత్త ఎల్లవరం గ్రామంలో వెంకటలక్ష్మీ ఇంటిపై ఉన్న పలంగా రెవెన్యూ సిబ్బంది, పోలీస్ యంత్రాంగం కలిసి కూల్చివేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, ఎల్లవరం సర్పంచ్ అభ్యర్ధి లోకారపు అప్పారావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** శ్రీచైతన్య విద్యాసంస్థలు నిర్వహిస్తున్న స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలోహెల్దీ లైవ్స్ – హెల్దీ

పరీక్షిస్తున్న వైద్యులు

మైండ్ పేరిట ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు సంతోష్ మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థి పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. మంచి ఆరోగ్యం మంచి ఆహారపు అలవాట్లు ఎలా పెంపొందించుకోవాలో వివరించారు.విద్యార్థులు ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు స్టాళ్లను సందర్శించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిటికెల శ్రీను, ఉత్తరాంధ్ర శ్రీచైతన్య పాఠశాలల ఏజియం ఎంవి సురేష్, గాజువాక ప్రాంతీయ సంచాలకులు మాకిరెడ్డి రమణ, జోనల్ కోఆర్డినేటర్ లెంక రాజేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎన్.వి. రమణ, డీన్ వానపల్లి నాగేశ్వరరావు, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ నాగ మైథిలీ, సత్యప్రభ పాల్గొన్నారు.

## మహిళా పోలీసులకు బహుమతులు

**ప్రజాశక్తి-రోలుగుంట:**లోక్‌అధాలత్ కేసుల్లో రాజీ పెట్టేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించిన మహిళా పోలీసులకు కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాజ్ మహమ్మద్ బహుమతులు అందజేశారు. కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన సౌజన్యకు మొదటి బహుమతిగా, రోలుగుంట గ్రామానికి చెందిన మహాలక్ష్మీకి రెండవ, కొండలపాలెం గ్రామానికి చెందిన నూకరత్నంకు మూడవ బహుమతుగా అందజేసినట్లు ఎస్సై నాగకార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట ఎస్సై నాగకార్తీక్ పాల్గొన్నారు.

బహుమతి ఇస్తున్న సిఐ

## అర్హులకు గృహాలు మంజూరు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గొల్ల బాబురావు తెలిపారు. మండలంలోని జానకయ్య పేటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తూ, పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని, పథకాలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్నారని తెలిపారు. గృహాలు మంజూరు చేయాలని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, లోడగల చంద్రరావు, సూరకాసుల గోవింద్, ఎలమంచిలి తాతారావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పర్యటిస్తున బాబురావు

## నిరుపేదలకు అన్నదానం

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలో పాకలపాడు గ్రామంలో బుధవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంధ్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ, అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని అన్నారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం బుధవారం ప్రారంభించామని, ఇక నుండి దాతలు సహకారంతో ప్రతి బుధవారం అన్నదానం నిర్వహిస్తామన్నారు. యాచకులకు, నిరుపేదలకు, కూలీలకు, చిరువ్యాపారులకు, బాటసారులకు, వికలాంగులకు ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదానం చేసినట్లు వివరించారు.

మాట్లాడుతున్న టిడిపి నేత కుమార్

## పేదలకు సొంత గృహాలు ఏవీ?

**ప్రజాశక్తి-మాడుగుల:** వైసీపీ ప్రభుత్వంలో పేదలకు సొంత ఇల్లు కలగా మారాయని టిడిపి ఇన్చార్జ్ కుమార్ విమర్శించారు .బుధవారం మాడుగులలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలకు సొంత గూడు కల్పిస్తామని ఎన్నికల ముందు వైసీపీ నేతలు హామీ ఇచ్చారన్నారు. 42 నెలలు గడిచినప్పటికీ పేదలకు పూర్తిస్థాయి గృహాల నిర్మాణాలు జరగలేదన్నారు. ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు పేదలకు సొంత ఇల్లు నిర్మించామని చెప్తున్నారని ఎంతమందికి ఎన్ని ఇల్లు మంజూరు చేశారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాలలో గోతులు మయంగా ఉన్న స్థలాలలో పట్టాలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు రంజిత్ వర్మ, ఎన్‌వి ప్రసాద్, పుప్పాల రమేష్, పిఎస్ఎన్ రాజు, కోన నాగేశ్వరరావు, తుంపాల రామకొండ తదితరులు పాల్గొన్నారు.

బాబ్జికి శుభాకాంక్షల తెలుపుతున్న గ్రామస్తులు

## ఘనంగా బాబ్జి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని ఉద్దండపురం గ్రామంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు, చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన పలువురు బాబ్జిని కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లం రమణ, త్రిమూర్తులు (విష్ణు), వెలంకాయల శ్రీను, బచ్చుల రాజు, నల్లల రామకృష్ణ, రమణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

## విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

**ప్రజాశక్తి-రావికమతం:**విధుల పట్ల అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని ఇఆర్ఒ ప్రమీల గాంధీ తెలిపారు. తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్సీ ఓట్ల నమోదు, ఫారెస్ట్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ భూముల్లో ఎంతమంది రైతులు సాగులో ఉన్నారు, ఎంతమందికి అటవీ హక్కు పత్రాలను అందజేశామని ఆరా తీశారు. మండలంలో భూముల రీ సర్వే, పెండింగ్ ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పనులన్నింటిని సత్వరమే వేగవంతం చేయాలని అధికారులను ఆమె సూచించారు. ప్రభుత్వం అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తొలగిస్తున్న తుప్పలు

## తుప్పలు తొలగింపు

### ప్రజాశక్తి కథనానికి స్పందన

**ప్రజాశక్తి -కోటవురట్ల:**తుప్పలతో తిప్పలు పేరిట ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. లింగాపురం వద్ద ఉపాధి సిబ్బంది గడిచిన రెండు రోజులుగా తుప్పలు తొలగింపు చేపట్టారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు తొలగాయి. అదేవిధంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు తొలగించాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి -కోటవురట్ల:** జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా త్రో బాల్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడవ తరగతి చదువుతున్న పాములవాక విద్యార్థిని కన్నూరు కవిత ఎంపికైనట్లు కళాశాల ప్రధానఉపాధ్యాయులు శకుంతల, పిడి అచ్యుతరావు తెలిపారు. ఈ సందర్భంగా కమలకు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'ఫ్యామిలీ ఫిజీషియన్'తో మేలు

**ప్రజాశక్తి-రావికమతం:**ప్రతి ఇంటికి వైద్యం అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని కవగుంట సర్పంచ్ డి.సూర్య కుమారి వరహాలు తెలిపారు. కొమిర సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ, 104, 108, పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచి పోయారన్నారు. వైద్యులు దుర్గాప్రసాద్ 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేబిపి అగ్రహారం సర్పంచ్ కలిగిరి ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పి కుమారి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**పాయకరావుపేట:**మండలంలోని శ్రీరాంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కుమార్‌పురం గ్రామ సచివాలయం వద్ద ఫ్యామిలీ క్లినిక్‌ను గ్రామ సర్పంచ్ పి.గోవిందమ్మ ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్లు తులసి, నవీన, 104 మెడికల్ ఆఫీసర్ బత్తుల రత్నశేఖర్‌లు రోగులను పరీక్షించారు. మంచాన పడిన దీర్ఘకాలీక వ్యాధిగ్రస్తులను, వృద్ధుల ఇంటికి వెళ్లి వైద్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఒ ఆర్‌జె బాలాజీ సింగ్, మలేరియా ఇంఛార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** గ్రామీణ పేదల ఆరోగ్య దృష్ట్యా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వల్ల నేరుగా ఇళ్ల వద్దకే మెరుగైన వైద్యం అందుతుందని కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు అన్నారు. వేచలం పీహెచ్సీ ఆధ్వర్యంలో కొత్తపెంటలో బుధవారం ఏర్పాటు చేసి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యాధికారి గోవిందరెడ్డి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## రూ.3.15 కోట్లతో ఇంటింటికి కుళాయిలు

### ఉప ముఖ్యమంత్రి బూడి

**ప్రజాశక్తి -చీడికాడ:**మండలంలో కోణం గ్రామంతో పాటు పంచాయతీ పరిదిలో అన్ని గ్రామాలకు రూ.3.15 కోట్లతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు తెలిపారు. మండలంలో బుధవారం కోణం చిన కోణంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల నాయుడు ముందుగా గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పించారు అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్, మండల వైసీపీ కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు, యువజన అధ్యక్షుడు జి.స్వామి నాయుడు, వైస్ ఎంపీపీలు ధర్మ శెట్టి స్వాతి కొండబాబు, కిమిడి చినమ్మలు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

సమస్యలు తెలుసుకుంటున్న బూడి

## స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే రిజర్వేషన్లు ఉండవు

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే రిజర్వేషన్లు లేకుండా పోతాయని, ఎస్‌సి, ఎస్‌టిల ఉపాధికి నష్టం జరుగుతుందని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.గణేష్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 594వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ప్రయివేటీకరణకు దూకుడు ప్రదర్శిస్తుంటే, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం దానిని ఎదుర్కోవడం మానేసి, కేంద్ర చర్యలకు అనుకూలంగా వ్యవహరిస్తుండడం అనుమానాలు కలిగిస్తుందని పేర్కొన్నారు. కేంద్రం చర్యలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రతిఘటించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కేంద్రం నిర్ణయం తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఈ దీక్షల్లో యూనియన్ నాయకులు ఇ.నీలయ్య, ఎస్.విజయ్‌కుమార్, కె.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసును ప్రారంభిస్తున్న అక్విటీ సొల్యూషన్స్ ప్రతినిధులు

## విశాఖలో మెడికల్ కోడింగ్ ఆఫీసు ప్రారంభం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** వర్చువల్ మెడికల్ స్క్రైబ్స్, మెడికల్ కోడర్ల కోసం విశాఖపట్నంలో 500 మంది సామర్థ్యంతో నిర్వహణ కేంద్రాన్ని విఐపి రోడ్, సిబిఎమ్ కాంపౌండ్‌లో అక్విటీ సొల్యూషన్స్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా అక్విటీ సొల్యూషన్స్ సిఒఒ జాసన్ కొలినోస్కి, సిఇఒ కశ్యప్ జోషి మాట్లాడుతూ, ఈ కార్యాలయం స్థానిక యూనివర్సిటీ హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు సహాయ పడుతుందన్నారు. వైజాగ్‌లో వ్యాపార విస్తరణ ద్వారా శరవేగంగా విస్తరిస్తున్న క్లినికల్ డాక్యుమెంటేషన్ సేవల మార్కెట్లో అక్విటీ మార్కెట్ అగ్రగామిగా వృద్ధి సాధించనుందని తెలిపారు. వర్చువల్ స్క్రైబింగ్, మెడికల్ కోడింగ్ వ్యాపారాలు వృద్ధిని సాధిస్తున్నాయని చెప్పారు. గీతమ్, అవంతి, విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్‌లతో హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్‌లతో కలిసి పనిచేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

## 'అవంతి'తో ఆక్విటీ సొల్యూషన్స్ ఎంఒయు

**ప్రజాశక్తి -తగరపువలస :** డొమైన్‌లోని విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన శిక్షణనిచ్చే లక్ష్యంతో స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌తో, ఆక్విటీ సొల్యూషన్స్ సంస్థ బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అవగాహన పత్రాలు పరస్పర మార్పిడి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆక్విటీ సొల్యూషన్స్ అధ్యక్షులు, సిఇఒ కశ్యప్ జోషి మాట్లాడుతూ, డిజిటల్ స్క్రైబ్ హెల్త్‌కేర్‌లో అభివృద్ధి చెందుతున్న మెడికల్ డాక్యుమెంటేషన్‌లో యువతకు మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. తమ కార్య కలపాలను విస్తరించే యోచనలో భాగంగా విశాఖలో త్వరలో అక్విటీ సొల్యూషన్స్ కొత్త బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ బి.శర్మ మాట్లాడుతూ, 2021-22 ఏడాదికి ఇక్కడి క్యాంపస్ నుంచి 20మంది ఫార్మసీ విద్యార్థులను రిక్రూట్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవంతి ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ టి.శ్రీనివాస్ సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబివి రాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.ఉమాశంకర్ కంపెనీ ప్రొఫైల్ గురించి వివరించారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

## నాబార్డ్ నిధులతో రైతు బజార్

**ప్రజాశక్తి- కొత్తకోట:**మేజర్ పంచాయతీ కొత్తకోటతో పాటు సుమారు మరో 20 గ్రామాల ప్రజలకు కనీస అవసరాలతో కూడిన రైతు బజార్ దుకాణ సముదాయాన్ని నాబార్డ్ నిధులతో సమకూరుస్తున్నట్లు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం కొత్తకోటలో నాబార్డ్ ఏజీఎం ఎస్.శ్రీనివాసరావుతో కలిసి దుకాణ సముదాయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాంతాల వలే గ్రామీణ ప్రాంతాల్లో కూడా రైతు బజార్ ఏర్పాట్లకు చర్యలు చేపడుతున్నట్లు ధర్మశ్రీ తెలిపారు. కనుమరుగవుతున్న వారపు సంతలను అభివృద్ధి చేసి రైతులతో పాటు వినియోగదారులకు సదుపాయాలతో కూడిన మార్కెట్ యార్డ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సుమారు రూ.15 లక్షల నా బార్డు నిధులతో రెండు షెడ్డులను నిర్మించి 40 దుకాణ సముదాయం కల్పిస్తామని పెన్సింగ్, సోలార్ లైట్లు, గేట్ తదితర సదుపాయాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో, మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఆరోగ్యకరమైన సరుకులు కొనుగోలు చేసుకునే అవకాశం వినియోగదారులు కలుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

నాబార్డ్ ఏజీఎం శ్రీనివాస రావు మాట్లాడుతూ, జిల్లాలో మేజర్ పంచాయతీలకు సుమారు రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసి మరో మూడున్నర లక్షలు పంచాయతీ మ్యాచింగ్ గ్రాంటుతో మార్కెట్ యార్డులలో దుకాణ సముదాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవా, వైఎస్ఆర్ సిపి జిల్లా తలారి ఆదిమూర్తి, మండల కార్యదర్శి శీలం శంకర్రావు, ఎంపీటీసీ పూడి దేవా, కె.శంకర్రావు, పైల దాసు, కార్యదర్శి కృష్ణ మోహన్, ఉమా, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

## సదరం క్యాంప్‌లను వినియోగించుకోవాలి

### ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలవేణి దేవి

**ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:**జిల్లా వ్యాప్తంగా నిర్వహిం చే సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నీలవేణి దేవి కోరారు. బుధవారం ఏరియా ఆసుపత్రిలో మానసిక సమస్యలపై సదరన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ, రెండు రోజులపాటు ఈ క్యాంపు జరుగుతుందని, ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్న మానసిక ఇబ్బందులు ఉన్నవారిని పరీక్షించి నిపుణులైన వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేస్తారని తెలిపారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రక్తదాన శిబిరాలు, సదరన్ క్యాంపులు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సదరన్ క్యాంప్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న వారిని రోజుకు 60 మంది చొప్పున 120 మందిని నిపుణులైన ఇద్దరు వైద్యులు పరీక్షించి, వారి మానసిక అంగవైకల్య శాతాన్ని నిర్ధారిస్తారన్నారు. ఈ నిర్ధారణ సర్టిఫికెట్ ఆధారంగానే ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షన్, తదితర లబ్ది పొందే అవకాశం ఉందన్నారు. మానసిక వైద్యనిపుణులు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని, పాడేరు జిల్లా ఆసుపత్రి సైకాలజిస్ట్ డాక్టర్ శివరామకృష్ణ, చిన్నారులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, హెడ్ నర్సులు పాల్గొన్నారు.

క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు

## దుక్కి ట్రాక్టర్ కింద పడి రైతు మృతి

**ప్రజాశక్తి-కొత్తకోట:**రావికమతం మండలం చీమలపాడు శివారు రొచ్చుపనుకు గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం ఓ గిరిజన రైతు ప్రమాదవ శాత్తు దుక్కు టాక్టర్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంచి మృతిని కుమారుడు సన్యాసి కథనం మేరకు... గ్రామానికి చెందిన గిరిజన రైతు కట్టెల బాల రాజు (56) తన జీడిమామిడి తోటలో గంపవానిపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామేలపు దేవుడు తో తుప్పలు, డొంకలు తొలగింపుతో పాటు దుక్కు పనులు చేయిస్తున్నాడు. దక్కు ట్రాక్టర్‌లో పడిన చెత్తను బాలరాజు తొలగిస్తుండగా ప్రమాద వశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో సమీపంలో ఉన్న మృతుని చిన్న కుమారుడు కళ్యాణ్ గమనించి కేకలు వేయడంతో ట్రాక్టర్ డ్రైవర్ దేవుడు ట్రాక్టర్‌ను అదుపు చేసాడు. తీవ్రంగా గాయపడిన బాలరాజుకు సపర్యలు చేసినప్పటికీ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతిని పెద్ద కుమారుడు సన్యాసి కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసాడు.